క్లుప్తంగా

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఐరాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మహేష్‌కుమార్ తెలిపారు. కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. మండల ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పించి పరిష్కరించుకోవాలని సూచించారు. మండలస్థాయి అధికారులు హాజరుకావాలని సూచించారు.

నేడు ఫ్యామిలీ డాక్టర్

తవణంపల్లె: మండలంలోని ఎగువ తడకర పంచాయతీ ఎగువ వెంకటాపురంలో సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక వైద్యాధికారి ప్రియాంక తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీరప్పచెరువులో..

ఐరాల: మండలంలోని బీరప్పచెరువులో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తామని తెలిపారు. గర్భిణులకు బీపీ, షుగర్, థైరాయిడ్, గుండె సంబంధిత పరీక్షలు చేసి సూచనలు, సలహాలు ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రేపు గంగజాతర



అమ్మవారి విద్యుత్‌దీపాల కటౌట్

బంగారుపాళెం: మండల కేంద్రంలో మంగళవారం గంగమ్మ జాతరను వైభవంగా నిర్వహించనున్నట్లు జాతర కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఉదయం అమ్మవారికి అంబళ్లు, సాయంత్రం పొంగళ్లను నైవేద్యంగా సమర్పించనున్నట్లు తెలిపారు. రాత్రి అమ్మ వారి శిరస్సును ఊరేగించి నడివీధిలో కొలువుదీర్చనున్నట్లు తెలిపారు. బుధవారం సాయంత్రం అమ్మవారిని మేళతాళాలు, మంగళవాయిద్యాలు, బాణాసంచా వేడుకల నడుమ జల ప్రవేశానికి తరలించనున్నట్లు పేర్కొన్నారు. జాతరను పురస్కరించుకుని గ్రామంలో విద్యుదీపాలతో అమ్మవారి కటౌట్లను ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఎస్‌డీపీఐ సమావేశం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలో ఆదివారం సోషియల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డీపీఐ) కార్యకర్తల సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా ఎస్‌డీపీఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు చాంద్ బాషా, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ గని హాజరయ్యారు. వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఎస్‌డీపీఐ పార్టీ రాజ్యాంగ విరుద్ధమైన వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా ఆందోళన చేసిన జాతీయ అధ్యక్షుడు ఎంకే ఫైజీని కేంద్ర ప్రభుత్వం అరెస్టు చేయించిందన్నారు. అయినా పార్టీ ప్రజల పక్షాన నిరంతరం పోరాటం సాగిస్తూనే ఉంటుందని తెలియజేశారు. మహమ్మద్ గని మాట్లాడుతూ రాష్ట్రంలో సెక్యులర్ భావాలు కలిగిన అన్ని వర్గాలను కలుపుకొని ముందుకు సాగుతున్న పార్టీ కేవలం ఎస్‌డీపీఐయేనని స్పష్టం చేశారు.

తొలకరి దుక్కులు ప్రారంభం



దుక్కి దున్నుతున్న రైతు

తవణంపల్లె: మండలంలో కొద్ది రోజులుగా అకాల వర్షాలు కురుస్తున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాకముందే అకాల వర్షాలు కురవడంతో రైతులు దుక్కులు దున్నడానికి సిద్ధమవుతున్నారు. మెట్టపొలాల్లో రైతులు వేరుశనగ పంట సాగు చేయడానికి ముందస్తుగా దుక్కులు దున్నడం ప్రారంభించారు. మండలంలోని రైతులు ప్రభుత్వం సరఫరా చేసే రాయితీ వేరుశనగ విత్తనాల కోసం రైతన్నలు ఎదురుచూస్తున్నారు.

20న మినీ మహానాడు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నియోజకవర్గ మినీ మహానాడును ఈ నెల 20న నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ తెలిపారు. నగరంలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో నిర్వహించే మహానాడుకు టీడీపీ శ్రేణులు హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు









భీముడు, దుర్యోధునుడి వేషధారుల యుద్ధ ఘట్టంలోని సన్నివేశాలు

అలరించిన దుర్యోధన వధ

గుడిపాల: మండలంలోని వసంతాపురంలో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో గత 18 రోజులుగా జరుగుతున్న మహాభారత ఉత్సవాలు ఆదివారం దుర్యోధన వధ ఘట్టంతో ముగిశాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. తదుపరి భాగవతారిణి వినయప్రసాద్‌రెడ్డి హరికథా కాలక్షేపం చేశారు. మధ్యాహ్నం దుర్యోధన వధ ఘట్టాన్ని కళాకారులు రక్తి కట్టించారు. దుర్యోధనుడు గంగ మడుగులో దాక్కుని ఉండగా, భీమసేనుడు బయటకి లాక్కొచ్చి చేసే యుద్ధ సన్నివేశం ఆహుతులను ఆలరించింది. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్యోధనుడి ప్రతిమ వద్ద సాగిన భీమ, దుర్యోధన వేషధారుల భీకరపోరు భక్తులను కట్టి పడేసింది. ఇద్దరి మధ్య వీరోచితంగా సాగిన పోరులో దుర్యోధనుడు తనువు చాలించాడు. కళాకారుల నాటక ప్రదర్శన ప్రజలను ఆకట్టుకుంది. అనంతరం ధర్మరాజుల పట్టాభిషేకం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి అగ్నిగుండ ప్రవేశాన్ని భక్తి ప్రపత్తులతో నిర్వహించారు.

బడి బస్సులు బాగున్నాయా?

బడి బస్సుల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. స్కూల్ పిల్లలను తీసుకెళ్లే వాహనాల కండీషన్ దారుణంగా ఉంది. ఎప్పటికప్పుడు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోవాల్సిన పాఠశాల యాజమాన్యాలు ఆ దిశగా దృష్టి సారించడం లేదు. కాలం చెల్లిన వాటిని రోడ్లపై తిప్పుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. జూన్ 12వ తేదీ బడులు తెరుచుకోగా, బడి బస్సుల ఫిట్‌నెస్ గడువు ముగిస్తోంది. దీంతో అప్పుడే కొన్ని బస్సులు ఫిట్‌నెస్ పరీక్షించుకుంటున్నాయి. మిగిలిన బస్సులకు కూడా ఫిట్‌నెస్ పరీక్ష చేయించుకునేలా రవాణా శాఖ అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు.



బస్సు కండీషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

- ముగియనున్న ఫిట్‌నెస్ గడువు
- కాలం చెల్లిన వాటితో ప్రాణ సంకటం
- ముందుగా హెచ్చరిస్తున్న రవాణాశాఖ అధికారులు
- ఫిట్‌నెస్‌పై అధికారుల స్పెషల్ డ్రైవ్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలో బడి బస్సులు 900కు పైగా ఉన్నాయి. కొద్దిరోజుల్లో బడులు పునఃప్రారంభం కావడంతో ఫిట్‌నెస్ పరీక్షకు బస్సులు రయ్‌రయ్‌మంటున్నాయి. ప్రతిరోజు 20 నుంచి 30 బస్సులకు అధికారులు బండి కండీషన్‌ను పరీక్షిస్తున్నారు. క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. వాహనంలో ఏదైనా లోటు పాట్లు కనిపిస్తే వెంటనే వెనక్కి పంపిస్తున్నారు. చిరిగిన సీట్లు, పగిలిన అద్దాలు, అరిగిన టైర్లు, ఫిట్‌నెస్ లేకపోవడం, కాలం చెల్లినవే దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా బ్రేకు పనితీరును పసిగడుతున్నారు. ఈ లోపాలు పరీక్షకు వచ్చే బస్సుల్లో అధికంగా కనిపిస్తున్నాయి. వాటిని వెంటనే వెనక్కి పంపిస్తున్నారు. ఈ నేపథ్యంలో బడి బస్సులను ముందస్తుగా సిద్ధం చేసుకోవాల్సిన ప్రైవేట్ యాజమాన్యాలు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని తెలుస్తోంది. ఫిట్‌నెస్ లేకుండా బస్సు లు తిప్పితే ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశా లు లేకపోలేదు. ఆ లోపాలను సరిదిద్దేంత వరకు సర్టిఫికేట్ జారీ చేయడంలేదు. దీంతో బడి నిర్వాహకులు సైతం బండి కండీషన్‌ను పక్కాగా తీసుకొస్తున్నారు.

ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేస్తాం



ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు బస్సుల ఫిట్‌నెస్ తప్పనిసరిగా చేయించాలి. పాఠశాలలు పునఃప్రారంభానికి ముందే ఈ ప్రక్రియ పూర్తి చేయాలి. ఫిట్‌నెస్ లేని బస్సులు రోడ్డు పైకి వస్తే సీజ్ చేస్తాం. నిబంధనలకు సంబంధించి డ్రైవర్లు, యాజమాన్యాలకు తెలియపరుస్తున్నాం. భద్రత విషయంలో ప్రత్యేక చర్యలు చేపడతాం.

–నిరంజన్‌రెడ్డి, డీటీసీ, చిత్తూరు

పరీక్షలు ఇలా...

- స్కూల్ బస్సులను మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు స్వయంగా డ్రైవ్ చేస్తారు.
- బస్సులోపల, బయట పూర్తిగా పరిశీలించి మరమ్మతులు చేయాల్సినవి గుర్తిస్తారు.
- డ్రైవింగ్‌కు సంబంధించి బ్రేకులు, క్లచ్, స్టీరింగ్, హ్యాండ్ బ్రేక్, బ్యాటరీ, ఇంజిన్‌కు సంబంధించి పలు విభాగాలను పరిశీలిస్తారు.
- అత్యవసర ద్వారాలు, కిటికీలు, టైర్లు, సీట్లు, ఇలా ప్రతి దానిని పూర్తిగా పరిశీలిస్తారు.
- వాహనంలో అన్నీ బాగున్నాయని సంతృప్తి చెందిన తర్వాత ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తారు.

నిబంధనలు ఇలా...

- ఐదేళ్ల అనుభవంతో కూడిన భారీ వాహన లైసెన్సు ఉండాలి.
- డ్రైవర్ వయసు 60 ఏళ్ల లోపు ఉండాలి.
- శారీరక దారుఢ్యం కలిగి ఉండాలి. పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్లు ధ్రువీకరణ ఉండాలి.
- డ్రైవర్, సహాయకుడు యూనిఫాం ధరించాలి. వేగంగా, నిర్లక్ష్యంగా బస్సు నడపరాదు.
- బస్సుల్లో ప్రథమ చికిత్స బాక్సు ఉండాలి.
- బస్సులోకి విద్యార్థులు ఎక్కేందుకు, దిగేందుకు ఆధారంగా రెండు వైపులా ఇనుప కడ్డీలు ఉండాలి. బస్సు ముందు భాగంలో పాఠశాల పేరు, చిరునామా, ఫోన్ నంబర్లు తప్పనిసరి.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



యాదమరి: విద్యుత్ అధికారుల నిర్లక్ష్య ధోరణి ప్రాణ సంకటంగా మారుతోంది. మండల పరిధిలోని కాశిరాళ్ల గ్రామం సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఎదురుగా ఉన్న మినీ ట్రాన్స్‌ఫార్మర్ చేతికి అందే స్థాయిలో ఉండడంతో ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. అయితే దీనిపై సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోక నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మామూళ్ల మత్తులో ఉన్న ట్రాన్స్‌కో అధికారులు చేతులు తడిపితే గానీ సమస్యను పరిష్కరించరా అని ప్రశ్నిస్తున్నారు.

అలనాటి జ్ఞాపకాల ఒడి



గుడిపాల మండలంలోని నరహరిపేట ఉన్నత పాఠశాలలో 1998-99లో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే బడిలో కలుసుకున్నారు. ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసుకుంటూ స్థిరపడ్డారు. వీరందరూ కలుసుకుని ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. వీరిలో కొంతమంది ఆర్మీలో ఉద్యోగాలు చేసి విరమణ పొందిన వారిని సన్మానించారు. తమతో చదువుకొని దేశ సైన్యంలో ఉద్యోగాలు పొందడం గర్వంగా ఉందన్నారు. వారికి చదువులు నేర్పిన అలనాటి గురువులను సన్మానించారు. - గుడిపాల





గురువును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు, సత్కారం అందుకుంటున్న మాజీ సైనికుడు

సృజనాత్మకత పెంపొందించుకోవాలి



శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్ రాజశేఖర్

ఐరాల: విద్యార్థులు చదువుతోపాటు వేసవి విజ్ఞాన శిబిరానికి హాజరై సృజనాత్మకతను పెంపొందించుకోవాలని స్థానిక గ్రంథాలయాధికారి సుజాత పేర్కొన్నారు. గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు క్విజ్ పోటీలు, చిత్రలేఖనం, ఇంగ్లిష్ జంబ్లింగ్ పదాల ఉచ్చారణ, పొడుపు కథలు, కంప్యూటర్, భగవద్గీత శ్లోకాలు తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చారు. విరామం సమయంలో విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, పరుగు పందేలు నిర్వహించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు ఎండకు తిరగకుండా వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ రాజశేఖర్ పాల్గొన్నారు.

బంగారుపాళెంలో క్యాండిల్ ర్యాలీ



క్యాండిల్ ర్యాలీ చేస్తున్న వైద్యసిబ్బంది

బంగారుపాళెం: మండల కేంద్రంలో హెచ్ఐవీ మృతులకు ఆత్మశాంతి కలగాలని వైద్య సిబ్బంది ఆదివారం సాయంత్రం క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ విజయకుమారి మాట్లాడుతూ, ఏటా మూడో ఆదివారం హెచ్ఐవీతో మరణించిన వారిని స్మరించుకుండా క్యాండిల్ ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు. హెచ్ఐవీ బాధితులు ఎవరూ అధైర్య పడవద్దని సూచించారు. ఏఆర్‌టీ మందులను క్రమం తప్పకుండా వాడితే జీవిత కాలాన్ని సాగించవచ్చన్నారు. కార్యక్రమంలో డీపీఎం మణి, ఐసీటీసీ కౌన్సిలర్ బాబు, సిబ్బంది రెడ్డికుమారి, శశి, ద్రాక్షాయణి, సెల్వి, దాసు, జ్యోతిబాబు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ

యాదమరి: గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్థానిక ఎస్ఐ ఈశ్వర్ అన్నారు. ఆయన ఆదివారం ఉదయం మండలంలోని దిగువ కనతలచెరువు గ్రామంలో అటవీ శాఖా అధికారులతో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ పోలీసులకు ప్రజలకు మధ్య స్నేహ పూర్వక వాతావరణం కోసమే ఈ కార్యక్రమం చేపట్టామని అన్నారు. వన్య ప్రాణులను వేటాడరాదని చెప్పారు. అటవీ జంతువుల కోసం కొందరు విద్యుత్ తీగలను అమర్చడం వల్ల మనుషుల ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. సారా విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం గ్రామంలోని పలు ద్విచక్ర వాహనాలను, ఆటోలను, ట్రాక్టర్లను తనిఖీ చేశారు. రికార్డులు సరిగా లేనందున మూడు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు



పిల్లల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ శ్రీనివాసులు

బంగారుపాళెం: మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని సీఐ శ్రీనివాసులు అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం మండల కేంద్రంలో పోలీసులు మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ముగ్గురు మైనర్లు ద్విచక్ర వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. దీంతో ద్విచక్ర వాహనాలు నడిపిన పిల్లల తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ, మైనర్లకు వాహనాలు ఇవ్వడం తల్లిదండ్రుల చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. లైసెన్స్ లేని మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని, అలా వాహనాలు ఇచ్చిన వారి లైసెన్స్‌లు రద్దు చేస్తామని తెలిపారు. జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవేణుగోపాలుని బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

కార్వేటినగరం: శ్రీవేణుగోపాల స్వామివారి బ్రహ్మోత్సవాలకు ఆదివారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి పరివార దేవతలకు తిరుమంజనం నిర్వహించారు. ఉత్సవమూర్తులకు అభిషేకం, తోమాలసేవ, సహస్రనామార్చన చేశారు. సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు వేద ప్రబంధ శాత్తుమొర నిర్వహించారు. సేనాపతి ఉత్సవం చేపట్టారు. అనంతరం రాత్రి 7.15 నుంచి 8.30 గంటల వరకు మృత్సంగ్రహణం, మేదిని పూజ, శాస్త్రోక్తంగా అంకురార్పణతో సకల దేవతలకు ఆహ్వానం పలికారు. టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్, షరాబు బాబుసురేష్, ఆలయ అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

అపూర్వం



తవణంపల్లె మండలంలోని అరగొండ బాలుర ఉన్నత పాఠశాలలో 1986-87 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఒక్కచోట కలిశారు. పూర్వ విద్యార్థులు పాత జ్ఞాపకాలను నెమరువేసుకొని సంతోషంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు పాదపూజలు చేసి వారి ఆశీస్సులు పొందారు. సుమారు 200 మంది హాజరై రోజంతా సరదాగా గడిపారు.

- తవణంపల్లె